# సాక్షి వికారాబాద్

ఆదివారం । 12 । మార్చి । 2023






## కాంగ్రెస్‌తోనే సంక్షేమ పాలన

తెలంగాణలో వైఎస్సార్ సంక్షేమ పాలన కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. 8లో ▸



## పథకాలు నచ్చే బీఆర్‌ఎస్‌లోకి..

సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు నచ్చే వివిధ పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ అన్నారు. 8లో ▸



## ఆలయాల అభివృద్ధికి సహకారం

ఆలయాలు, పాఠశాలల అభివృద్ధికి నిరంతరం సహకరిస్తానని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. 9లో ▸

# రేపే పోలింగ్



వికారాబాద్‌లోని పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లను తెలుసుకుంటున్న కలెక్టర్ నారాయణరెడ్డి

**ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి**

- జిల్లాలో 1,936 మంది ఓటర్లు, 18 పోలింగ్ కేంద్రాలు
- అత్యధికంగా తాండూరులో 445 మంది, అత్యల్పంగా బంట్వారంలో 16 మంది ఓటర్లు
- ఓటరు స్లిప్, గుర్తింపు కార్డు తప్పనిసరి
- మద్యం దుకాణాల బంద్
- 24న కౌంటింగ్

**వికారాబాద్:** ఈ నెల 13న జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కలెక్టర్ నారాయణరెడ్డి ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. జిల్లాలో మొత్తం 1,936 మంది ఓటర్లు ఉండగా, 18 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. తాండూరులో అత్యధికంగా 445 మంది, బంట్వారంలో అత్యల్పంగా 16 మంది ఓటర్లు ఉన్నారు. ఎన్నికలు సజావుగా సాగడానికి భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ప్రచారం ముగియడంతో ఇకపై ప్రచారం చేయరాదని అధికారులు ఆదేశించారు. పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా, సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయరాదన్నారు. అలాగే పోలింగ్ ప్రశాంతంగా జరగడానికి అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. పోలింగ్ కోసం జిల్లాను ఐదు రూట్లుగా విభజించి పర్యవేక్షిస్తున్నారు. నిబంధనల మేరకు శనివారం సాయంత్రం నుంచి 48 గంటల పాటు మద్యం దుకాణాలను మూసి వేయించారు.

**గుర్తింపు కార్డు తప్పనిసరి**

ఓటు హక్కు వినియోగించుకోవడానికి వచ్చేవారు ఓటరు స్లిప్‌తో పాటు ప్రభుత్వం జారీ చేసిన ఐదు రకాల గుర్తింపు (ఆధార్, పాన్, పాస్‌పోర్ట్, విద్యాశాఖ జారీ చేసిన సర్వీసు గుర్తింపు కార్డు, డిగ్రీ సర్టిఫికెట్) కార్డుల్లో ఏదో ఒకటి తప్పనిసరిగా తీసుకెళ్లాలని సూచించారు. 100 మంది లోపు ఓటర్లు ఉన్న కేంద్రాల్లో ఒక ప్రిసైడింగ్ అధికారి, ఇద్దరు అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, అలాగే 100 మందికిపైగా ఓటర్లు ఉన్న కేంద్రాల్లో ఒక ప్రిసైడింగ్ అధికారితో పాటుగా ముగ్గురు అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు ఎన్నికల బాధ్యతలు నిర్వహించనున్నారు. పోలింగ్ నిర్వహణపై ఇప్పటికే రెండుసార్లు సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఎన్నికల సామగ్రి పంపిణీ, పోలింగ్ బాక్సుల స్వీకరణ కేంద్రాన్ని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేశారు. 12వ తేదీ ఉదయం ఎన్నికల సామగ్రిని పంపిణీ చేస్తారు. 24న బ్యాలెట్ బాక్సులను లెక్కింపు కోసం సరూర్‌నగర్ స్టేడియానికి పంపనున్నట్లు కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

**భారీ బందోబస్తు**

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు భారీగా పోలీసు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు. పోలింగ్ కేంద్రాలు ఉన్నచోట 100 మీటర్ల వరకు ఇతర వ్యక్తులు సంచరించరాదని ఆంక్షలు విధించారు. 144 సెక్షన్ అమల్లో ఉంటుందని పోలీసులు తెలిపారు. ముగ్గురు డీఎస్పీలు, ఐదు మంది సీఐలు, 18 మంది ఎస్‌ఐలు, 120 మంది పోలీసులతో బందోబస్తును ఏర్పాటు చేయనున్నారు. అదే విధంగా మొబైల్, ప్రత్యేక టీంలతో నిరంతరం పర్యవేక్షించేలా ఏర్పాట్లు చేశారు. ఒక్కో పోలింగ్ కేంద్రం వద్ద ఓ ఎస్‌ఐ, ఒక హెడ్ కానిస్టేబుల్, ఓ మహిళా పోలీసు, మరో నలుగురు కానిస్టేబుళ్లు విధులు నిర్వహించనున్నారు.

**జిల్లాలోని పోలింగ్ కేంద్రాలు**

| మండలం | పోలింగ్ కేంద్రం | ఓటర్ల సంఖ్య |
|---|---|---|
| కొడంగల్ | ప్రభుత్వ జూనియర్ కాలేజ్ | 84 |
| తాండూరు | .. | 445 |
| బొంరాస్‌పేట్ | జెడ్పీహెచ్ఎస్ | 18 |
| దౌల్తాబాద్ | .. | 29 |
| యాలాల | .. | 62 |
| బషీరాబాద్ | .. | 29 |
| పెద్దేముల్ | .. | 23 |
| బంట్వారం | .. | 16 |
| వికారాబాద్ | .. | 330 |
| వికారాబాద్ | .. | 234 |
| ధారూరు | .. | 30 |
| మర్పలి | .. | 24 |
| పూడూరు | .. | 57 |
| నవాబుపేట్ | .. | 51 |
| మోమిన్‌పేట్ | .. | 63 |
| కుల్కచర్ల | .. | 100 |
| దోమ | .. | 51 |
| పరిగి | .. | 290 |
| జిల్లాలో మొత్తం ఓటర్లు | | 1,936 |

## ఏర్పాట్లు పూర్తి చేయాలి



అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ

**వికారాబాద్ అర్బన్:** ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులకు సూచించారు. శనివారం ఆర్డీఓలు, నోడల్ ఆఫీసర్లు, తహసీల్దార్లు, సెక్టోరియల్ ఆఫీసర్లతో ఎన్నికల ఏర్పాట్లపై టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆదివారం సిబ్బంది పోలింగ్ సామగ్రి తీసుకొని కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, ఫ్యాన్లు, ఫర్నిచర్ వంటివి సమకూర్చుకోవాలని ఆదేశించారు. అన్ని కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు.



ఇప్పాయిపల్లిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న రామ్మోహన్‌రెడ్డి

## కాంగ్రెస్‌తోనే ప్రజాస్వామ్య పాలన

- ఈడీ నోటీసులు ఇచ్చినప్పుడే మహిళా బిల్లు గుర్తుకొచ్చిందా?
- డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

**కుల్కచర్ల:** ప్రజాస్వామ్య పాలన కాంగ్రెస్‌తోనే సాధ్యమని డీసీసీ అధ్యక్షుడు టీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం కుల్కచర్ల మండలం ఇప్పాయిపల్లిలో హాత్ సే హాత్ జోడో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంటేనే పేదలకు మేలు జరుగుతుందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం కొంత మందికి మాత్రమే లబ్ధి చేకూరేలా పథకాలు రూపొందిస్తోందని ఆరోపించారు. దీంతో అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందని పరిస్థితి నెలకొందన్నారు. భూ కబ్జాలు, రియల్ ఎస్టేట్ దందాలకు పరిమితమైన అధికార పార్టీ నేతలు పేదల కష్టనష్టాలను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఎంపీగా ఉన్న సమయంలో కవితకు మహిళా బిల్లు గుర్తుకు రాలేదని, లిక్కర్ స్కాంలో ఈడీ నోటీసులు ఇచ్చిన తర్వాత ఆ విషయం గుర్తుకొచ్చిందా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో నిరుపేద యువతులు మరణిస్తే స్పందించని అధికార పార్టీ నేతలు, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న కవిత గురించి మాత్రం ప్రత్యేక కార్యాచరణతో తెలంగాణ వాదాన్ని ఎత్తుకొని రాష్ట్ర ప్రజల మనోభావాలను రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఏకకాలంలో రూ. 2లక్షల రుణమాఫీ, సమగ్ర సర్వే చేసి రైతు భూ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ధరణి వ్యవస్థను రద్దు చేస్తామని ప్రకటించారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ సంస్కరణలు చేపడుతుందన్నారు. అనంతరం సాల్వీడు గ్రామంలో కొనసాగుతున్న బొడ్రాయి ప్రతిష్ఠాపన, ఆంజనేయస్వామి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధికి రూ. 50వేల విరాళం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, మాజీ ఎంపీపీ అంజిలయ్య, ఇప్పాయిపల్లి సర్పంచ్ అనురాధ, సాల్వీడు సర్పంచ్ బాలయ్య, కోఆప్షన్ మాజీ సభ్యులు జలీల్, బాబు తదితరులు పాల్గొన్నారు.

## సంజయ్‌పై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

**కుల్కచర్ల:** ఎమ్మెల్సీ కవితపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ కుల్కచర్ల జెడ్పీటీసీ రాందాస్‌నాయక్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక ఎంపీ హోదాలో మహిళపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. బండి సంజయ్ వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కితీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్‌రెడ్డి, పాల నర్సింలు, యాదయ్య, గౌస్, కృష్ణయ్య, రాజు, పర్గి అశోక్, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.



బండి సంజయ్‌పై కుల్కచర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

## న్యూస్‌రీల్

### అవకాశాలను అందిపుచ్చుకోవాలి

జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి

**వికారాబాద్ అర్బన్:** అవకాశాలను అందిపుచ్చుకొని మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి కోరారు. శనివారం పట్టణంలో ఆర్ రుద్రమదేవి సంస్థ డైరెక్టర్ స్వాతి అశ్విన్, బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నవీన్‌కుమార్‌ల ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లోని 60మంది మహిళలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు టీ సదానందరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రమేష్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ డాక్టర్ దీప, బీజేపీ కౌన్సిలర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

### రేపటి 'ప్రజావాణి' రద్దు

**వికారాబాద్ అర్బన్:** ఈ నెల 13న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ నారాయణరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించాలన్నారు. ప్రజా సమస్యలు తెలిపేందుకు కలెక్టరేట్‌కు రావద్దని సూచించారు.

### బండి వ్యాఖ్యలు ఆడబిడ్డలను అవమానించినట్లే

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజుగౌడ్



బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

**తాండూరు టౌన్:** ఎమ్మెల్సీ కవితపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు యావత్ తెలంగాణ ఆడబిడ్డలను అవమానించినట్లేనని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజుగౌడ్ అన్నారు. శనివారం తాండూరులోని అంబేద్కర్ చౌక్‌లో సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా రాజుగౌడ్ మాట్లాడుతూ.. కవితపై బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వెంటనే తన ఎంపీ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ నామరూపాలు లేకుండా పోతుందనే భయంతోనే కవితపై ఈడీ దర్యాప్తు చేయిస్తోందని ఆరోపించారు. ప్రజలు బీజేపీ ఆగడాలను గమనిస్తున్నారని, తగిన సమయంలో గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు విజయాదేవి, ఆసీఫ్, వెంకన్నగౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు హరిహరగౌడ్, ఇర్ఫాన్, నరేందర్ గౌడ్, హన్మంతు, సాగర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### మర్యాదపూర్వక కలయిక



ఒవైసీని కలిసి వస్తున్న నాయకులు

**అనంతగిరి:** ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీని వికారాబాద్ మైనార్టీ వెల్ఫేర్ ప్రతినిధులు శనివారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. వికారాబాద్‌లో చేపట్టే పలు అభివృద్ధి పనులపై వారు చర్చించారు. పట్టణంలో షాదీఖానా నిర్మాణం, శ్మశాన వాటిక కోసం 5 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించేలా చొరవ చూపడంపై కృతజ్ఞతలు తెలిపారు. ఓవైసీని కలిసిన వారిలో మైనార్టీ వెల్ఫేర్ సభ్యుడు ఎజాజ్, ఎంఐఎం పట్టణ కార్యదర్శి ఎండీ అలీం, నాయకులు షరీఫ్, మహమ్మద్, ఫిరోజ్ బేగ్, ఉస్మాన్ ఉన్నారు.

### నిందితుడికి ఐదేళ్ల జైలు

**శంకర్‌పల్లి:** స్నేహితుడిపై దాడి చేసిన వ్యక్తికి చేవెళ్ల సబ్ కోర్టులో ఐదేళ్ల జైలు శిక్ష, రూ. 50 వేల జరిమానా విధించారు. శంకర్‌పల్లి పోలీసుల వివరాల ప్రకారం.. పట్టణంలోని సాయిబాబా ఆలయం వద్ద అమిత్‌పాండే (28), అతడి స్నేహితుడు శ్యామాజీరావు(29) ఒకే గదిలో అద్దెకు ఉండేవారు. వీరి మధ్య విభేదాలు రావడంతో 2016 మే నెలలో అమిత్‌పాండే, శ్యామాజీరావుపై కత్తితో దాడిచేశాడు. తీవ్రగాయాల పాలైన బాధితుడిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. శ్యామాజీరావు తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్‌ఐ రామేశ్వర్‌రెడ్డి కేసు నమోదు చేశారు. ఈ కేసును పరిశీలించిన ఏఎస్‌జే అమిత్‌పాండేకు పైశిక్ష విధించారు. నిందితుడికి శిక్షపడేలా కృషి చేసిన సీఐ, ఎస్‌ఐని ఉన్నతాధికారులు అభినందించారు.

# పరీక్షలకు వేళాయే..



- 15 నుంచి ఇంటర్ ఎగ్జామ్స్
- హాజరుకానున్న 17,828 మంది విద్యార్థులు
- జిల్లా వ్యాప్తంగా 30 కేంద్రాలు
- ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లు
- నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

**తాండూరు:** ఇంటర్మీడియెట్ పరీక్షలకు జిల్లా అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 15వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పరీక్షలకు ఇంటర్ బోర్డు అధికారులు సమాయత్తమయ్యారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో మొత్తం 74 ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాలల్లో 17,828 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల్లో 30 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒక్కో కేంద్రంలో 25 మంది విద్యార్థులకు గాను ఒక ఇన్విజిలేటర్‌ను నియమించనున్నారు. మొత్తం 715 మంది ఇన్విజిలేటర్లు విధులు నిర్వహించనున్నారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో 9,231 మంది విద్యార్థులు ఉండగా జనరల్ కేటగిరిలో 7,857 మంది, ఒకేషనల్ విభాగంలో 1,374 మంది పరీక్షలు రాయనున్నారు. సెకెండ్ ఇయర్‌లో 8,657 మంది ఉండగా, జనరల్ విభాగంలో 7,440 మంది, ఒకేషనల్ విభాగంలో 1,217 మంది పరీక్షలు రాయనున్నారు. ఇద్దరు సభ్యులతో కూడిన రెండు బృందాలను సిట్టింగ్ స్క్వాడ్‌లుగా నియమించారు. మరి కొన్ని ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా పరీక్ష కేంద్రంలోకి అనుమతించరు. గంట ముందుగా పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకోవాలి.

**ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లు**

పరీక్షలు రాసే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఇంటర్ బోర్డు అధికారులు చర్యలు చేపట్టారు. ప్రైవేటు కళాశాలల్లో ఫీజుల కోసం హాల్‌టికెట్లు ఇవ్వని పరిస్థితులు ఎదురవుతున్న నేపథ్యంలో విద్యార్థులు ఇబ్బంది పడరాదని ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లను అందుబాటులో ఉంచారు. హాల్ టికెట్‌పై ప్రిన్సిపాల్ సంతకం లేకున్నా పరీక్షలు రాసే వెసులుబాటు కల్పించారు.

**ఏర్పాట్లు పూర్తి**



ఈ నెల 15 నుంచి జరిగే ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం.విద్యార్థులు గంట ముందు పరీక్ష కేంద్రాలకు చేరు కోవాలి. ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా కేంద్రంలోకి అనుమతించం. హాల్‌టికెట్ ఇవ్వని ప్రైవేటు కళాశాలలపై చర్యలు తీసుకుంటాం. విద్యార్థులు ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లు పొందవచ్చు.

–శంకర్‌నాయక్,నోడల్ ఆఫీసర్, ఇంటర్ బోర్డు

## వేధింపులు భరించలేకే పల్లవి ఆత్మహత్య

**ఇబ్రహీంపట్నం రూరల్:** గిరిజన యువతి పల్లవి లైంగిక వేధింపుల కారణంగానే మరణించిందని, ఇందుకు కారకులైన ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఇబ్రహీంపట్నం ఏసీపీ ఉమామహేశ్వర్‌రావు వెల్లడించారు. ఆదిబట్ల మున్సిపల్ కొంగరకలాన్‌కు చెందిన అంతిరామ్ రెండో కుమార్తె పల్లవి రావిర్యాల్ సమీపంలోని వండర్లా పార్కులో పని చేస్తుండేది. రోజు ఉదయం 9 గంటలకు వెళ్లి, సాయంత్రం 7గంటలకు వచ్చేది. కానీ ఈ నెల 9న రాత్రి 9 గంటలు దాటినా రాలేదు. తండ్రి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. తోటి ఉద్యోగులను అడగ్గా సాయంత్రం 6గంటలకే ఇంటికి వెళ్లిపోయిందని తెలిపారు. దీంతో ఆదిబట్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు గాలించినా ఫలితం లేకుండా పోయింది. మరుసటి రోజు రిచ్‌గ్రీన్ వెంచర్లో పల్లవి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఆత్మహత్యకు గల కారణాలను పోలీసులు కుటుంబ సభ్యులను అడగ్గా.. ప్రవళిక రెండు నెలలుగా డిప్రెషన్‌లో ఉందని, వండర్‌లాలో పనిచేసే తోటి ఉద్యోగి క్రాంతికిరణ్ లైంగికంగా వేధించేవాడని, మరో ఉద్యోగి ప్రణయ్‌కుమార్ ప్రేమపేరుతో ఇబ్బంది పెట్టడంతోనే ఆత్మహత్య చేసుకుందని పల్లవి సోదరి తెలినట్లు ఏసీపీ వెల్లడించారు.

# ఆపదలో అండగా..

- ఓఆర్ఆర్ చుట్టూ 'ట్రామా కేర్' సెంటర్లు
- రోడ్డు ప్రమాద బాధితులకు సత్వర వైద్య సేవలు
- రెండేళ్లుగా వందలాది మందికి చేయూత

**ఔటర్ రింగ్ రోడ్డు, సర్వీస్ రోడ్లపై ప్రయాణిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నవారికి అత్యవసర వైద్య సేవలు అందిస్తూ ప్రాణాలు నిలుపుతున్నాయి ట్రామా కేర్ సెంటర్లు. ఓఆర్ఆర్ చుట్టూ ఏర్పాటు చేసిన 16 కేంద్రాల ద్వారా రెండేళ్లుగా వందలాది మంది క్షతగాత్రులకు అండగా నిలిచి ధైర్యం ఇవ్వడంతో పాటు అవరమైన ట్రీట్‌మెంట్ అందించారు.**




తుక్కుగూడలో ఓఆర్ఆర్ టోల్ వద్ద ట్రామా కేర్ సెంటర్

**తుక్కుగూడ:** ట్రామా కేర్ సెంటర్లతో క్షతగాత్రులకు సకాలంలో ప్రథమ చికిత్స అందుతోంది. ఔటర్ రింగు రోడ్డు (ఓఆర్ఆర్)లో నిత్యం ఏదో ఒక చోట ప్రమాదాలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో బాధితులకు సకాలంలో వైద్యం అందించాలనే సంకల్పంతో ఓఆర్ఆర్ నిర్వాహకులు ట్రామా కేర్ సెంటర్లను ఏర్పాటు చేశారు. ఓ ప్రైవేట్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిరంతర వైద్య సేవలు అందిస్తున్నారు.

**ఇప్పటికే 16 కేంద్రాలు..**

ఔటర్ చుట్టూ 19 టోల్స్‌ను ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన కార్యాలయాల్లోనే 16 ట్రామా కేర్ సెంటర్లను కొనసాగిస్తున్నారు. ఇప్పటి వరకు శంషాబాద్, పెద్దగోల్కొండ, తుక్కుగూడ, రావిర్యాల, బొంగ్లూర్, పెద్దఅంబర్‌పేట, తారామతిపేట, ఘట్‌కేసర్, శామీర్‌పేట, మేడ్చల్, అప్పాజంక్షన్, పటాన్‌చెరు, దుండిగల్ తదితర ప్రాంతాల్లో రెండేళ్ల క్రితం సెంటర్లు ప్రారంభించారు.

**అందుబాటులో వైద్య సేవలు..**

ట్రామా కేర్ సెంటర్ల ద్వారా ఔటర్ రింగు రోడ్డు, సర్వీస్ రోడ్డులో ప్రమాదాలకు గురైన వారికి ప్రథమ చికిత్స అందిస్తారు. ప్రథమ చికిత్స చేయడానికి వైద్య సిబ్బంది, బెడ్లు, ఆక్సిజన్ పరికరాలు, బీపీ మందులు తదితర పరికరాలు అందుబాటులో ఉంటాయి. క్షతగాత్రులను తీసుకురావడానికి అంబులెన్స్ సౌకర్యం ఉంటుంది. గాయపడిన వారికి మరింత మెరుగైన వైద్య సేవలను అందించడానికి డ్యూటీలో ఉన్న సిబ్బంది, వైద్యులకు అపోలో ఆస్పత్రి నుంచి సంబంధిత సీనియర్ డాక్టర్లు ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వస్తారు. గాయపడిన వారి పరిస్థితి ఆందోళనకరంగా ఉంటే.. ఇతర ప్రాంతాలకు పంపిస్తారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి ప్రథమ చికిత్స అందించడానికి ట్రామా కేర్ సెంటర్లు కీలక పాత్ర పోషిస్తున్నాయి.

**ప్రథమ చికిత్స అందిస్తున్నాం**



ఔటర్ రింగు రోడ్డులో ప్రమాదానికి గురైన వారి కోసం అపోలో ఆస్పత్రి ఆధ్వర్యంలో ట్రామా కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. నిత్యం వాహనదారులు రోజు ఏదో ఒక చోట ప్రమాదాలకు గురవుతుంటారు. వీరికి ప్రాథమిక చికిత్స అందించి, అవసరమైన వారిని మెరుగైన సేవలకోసం అంబులెన్స్‌లలో ఆస్పత్రికి తరలిస్తాం.

– ఎంఏ బారీ, ట్రామా ఉద్యోగి

**సేవలు భేష్**



ప్రమాదాలకు గురవుతున్న క్షతగాత్రులకు ఓఆర్ఆర్ టోల్ సెంటర్ల వద్ద ఉన్న ట్రామా కేర్ సెంటర్ల ద్వారా వైద్యం చేస్తున్నారు. తక్షణమే అందుతున్న వైద్య సేవల కారణంగా ఎంతోమంది ప్రాణాలు నిలబడుతున్నాయి. ట్రామా సేవలు చాలా బాగున్నాయి. బాధిత కుటుంబ సభ్యులు అనేక మంది ప్రత్యేకంగా వచ్చి ట్రామా సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

– శేఖర్‌గౌడ్, ఓఆర్ఆర్ ఉద్యోగి

## క్లుప్తంగా

### వేధింపులు భరించలేకే పల్లవి ఆత్మహత్య


క్రాంతి కిరణ్


ప్రణయ్‌కుమార్

ఇబ్రహీంపట్నం రూరల్: గిరిజన యువతి అంగోతు పల్లవి లైంగిక వేధింపుల కారణంగానే మరణించిందని, ఇందుకు కారకులైన ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఇబ్రహీంపట్నం ఏసీపీ ఉమామహేశ్వర్‌రావు వెల్లడించారు. ఆదిబట్ల మున్సిపాలిటీ కొంగరకలాన్‌కు చెందిన అంగోతు అంతిరామ్, సరిత దంపతుల రెండో కుమార్తె పల్లవి రావిర్యాల్ సమీపంలోని వండర్‌లా పార్కులో పని చేస్తుండేది. రోజు ఉదయం 9 గంటలకు వెళ్లి, సాయంత్రం 7గంటలకు వచ్చేది. కానీ ఈ నెల 9న రాత్రి 9 గంటలు దాటినా రాలేదు. తండ్రి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. తోటి ఉద్యోగులను అడగగా సాయంత్రం 6 గంటలకే ఇంటికి వెళ్లిపోయిందని తెలపడంతో వెంటనే ఆదిబట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు, కుటుంబ సభ్యులు గాలించినా ఫలితం లేకుండా పోయింది. మరుసటి రోజు ఉదయం రిచ్‌గ్రీన్ వెంచర్లో పల్లవి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఆత్మహత్యకు గల కారణాలను పోలీసులు కుటుంబ సభ్యులను అడగగా.. ప్రవళిక రెండు నెలలుగా డిప్రెషన్‌లో ఉందని, వండర్‌లాలో పని చేసే తోటి ఉద్యోగి క్రాంతికిరణ్ లైంగికంగా వేధించేవాడని, మరో ఉద్యోగి ప్రణయ్‌కుమార్ ప్రేమ పేరుతో ఇబ్బంది పెట్టడంతోనే ఇంతటి అఘాయిత్యానికి పాల్పడిందని పల్లవి సోదరి తెలిపింది. ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ ఉమామహేశ్వర్‌రావు తెలిపారు.

### ఇద్దరు దొంగల అరెస్ట్..


బైక్‌లు, సిలిండర్లను చూపుతున్న పోలీసులు

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలో చోటు చేసుకుంటున్న వరుస దొంగతనాలపై పోలీసులు నిఘా పెట్టారు. ఈ క్రమంలో ఇద్దరు నిందితులు పోలీసులకు చిక్కారు. పట్టణ సీఐ నవీన్‌కుమార్ కథనం ప్రకారం ఫరూఖ్‌నగర్ మండలం మధురాపూర్ గ్రామానికి చెందిన సుక్క ప్రశాంత్(25), పట్టణంలోని అయ్యప్ప కాలనీకి చెందిన ఎండీ.సోహైల్ (21) శనివారం పట్టణంలోని పద్మావతి కాలనీలో మూడు కమర్షియల్, మూడు డొమెస్టిక్ వంట సిలిండర్లను విక్రయిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా ఈ నెల 9న టీచర్స్ కాలనీలోని హనుమాన్ ఆలయం వద్ద బొలెరో వాహనం నుంచి సిలిండర్లను దొంగిలించినట్లు నేరం ఒప్పుకున్నారు.

**తీగ లాగితే డొంక కదిలింది**

పోలీసుల విచారణలో మరిన్ని దొంగతనాలు బయటపడ్డాయి. సుక్క ప్రశాంత్ గత నెల రోజుల క్రితం పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలో గల ఏటీఎం సెంటర్‌లో దొంగతనం చేసేందుకు ప్రయత్నించినట్లు పోలీసుల విచారణలో ఒప్పుకున్నాడు. 15 రోజులు క్రితం మహబూబ్‌నగర్ జిల్లా బూత్‌పూర్ మండల పరిధిలో ఒక ద్విచక్ర వాహనం వారం రోజుల క్రితం జడ్చర్లలో మరో ద్విచక్ర వాహనం, షాద్‌నగర్‌లో రెండు సెల్‌ఫోన్‌లను దొంగిలించనట్లు నిందితుడు ఒప్పుకున్నాడు. దీంతో పోలీసులను ఏసీపీ కుషాల్కర్ అభినందించారు.



## అడుగుకు ఒక చెట్టు..

# అభివృద్ధి మెట్టు

- ప్రకృతే ప్రాణకోటికి జీవనాధారం
- పండ్ల మొక్కలతో పశు, పక్ష్యాదులకు మేలు


అవెన్యూ ప్లాంటేషన్‌లో మొక్కలకు జాలీలు కడుతున్న సిబ్బంది

కొడంగల్ రూరల్: పల్లెలు మొదలుకుని ప్రపంచవ్యాప్తంగా సహజ సిద్ధంగా ఏర్పడిందే ప్రకృతి. ప్రాణకోటికి మనుగడ, జీవనాధారం ప్రకృతితోనే ముడిపడి ఉంది. సహజ వనరులు, ఆహార గొలుసు జీవులన్నింటికీ ప్రాణాధారం. మన పూర్వీకులు సహజసిద్ధంగా లభించిన పండ్లు, కూరగాయలు, దుంపలు(గడ్డలు), వన మూలికలను తీసుకుంటూ ఆరోగ్యంగా ఉండేవారు. మందులు, రసాయనాలు వాడని ఆహారం తీసుకోవడంతో వారు నిండు నూరేళ్లు జీవించేవారు. వ్యాధులు దరిచేరేవికావు. నేడు పారిశ్రామికాభివృద్ధితోపాటు పట్టణీకరణలో బాగంగా వ్యవసాయం, కూరగాయల సాగులో మితిమీరిన రసాయనాలు వాడుతూ దిగుబడులను పెంచుతున్నారు. పర్యావరణ కాలుష్యంతోపాటు భూ ఉపరితలం వేడెక్కుతూ అంతుచిక్కని రోగాలు దరిజేరుతున్నాయి.

**అవగాహన కరువు**

సహజసిద్ధంగా లభించే పండ్ల మొక్కలు కనుమరుగవుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని పంట పొలాల్లో సహజ సిద్ధంగా లభించే జీడిపండ్లు, ఇల్లింత పంగ, నక్కెర, పరికి పండ్లు, తుంకి పండ్లు, మొర్లి పండ్లు, మేడి, ఈత, పులిచెరి, చీమచింత వాటంతట అవే ఆయా కాలాల్లో లభిస్తాయి. దుంపగడ్డలు, చెంచు గడ్డలు తదితరవాటి ఆహారంగా తీసుకోవాలని ఉన్నా వివరించే వారు కరువయ్యారు.

**కాయగూరల ఆహారం తీసుకోవాలి**

ప్రాచీనకాలం నుండి మన పూర్వీకుల ఆకలి తీర్చి ఆరోగ్యాన్ని ఇచ్చే పొన్నగంటి, కొండపిండి, గునుగుకూర, గొర్మిటి, బొద్దికూర, గుంటగలుగర, లింగదంటికూర, వోమకూర, కుసుమకూర, ఆదొండ, మేడికాయలు, బోడ కాకరకాయ, చింతచిగురు తదితరవాటిని తీసుకోవడంతో ఆరోగ్యంగా జీవించేందుకు ఆస్కారం ఉంటుందని పేర్కొంటున్నారు.

**వన మూలికలు**

సహజ సిద్ధంగా లభ్యమయ్యే మొక్కల ఉపయోగాలు తెలుసుకుని వాడితే ప్రతీ మొక్క ఔషధ మొక్కే. సరస్వతి ఆకు, నేలవేము, ఉత్తరేణి, కుపెంట ఆకు, విష్ణుకాంత, లింగదంద, నేల ఉసిరి, అశ్వగంధ, కుందేటి కొమ్ము, అడివనాభి, పాదపత్రి, తిప్పతీగ, శతావరి, సిబ్బితీగ, నీటిబ్రహ్మి తదితర మొక్కల పెంపకంతోపాటు శాస్త్రవేత్తలు వాడే విధానాన్ని తెలియజేస్తూ ఆరోగ్యంగా ఉండేందుకు తోడ్పాటునందించాలని కోరుతున్నారు. ఆయుర్వేద వైద్యుల సలహాలు, సూచనలు పాటిస్తూ ఉపయోగించడంతో ఆరోగ్యంగా ఉండేందుకు వీలుంటుందని, అంతరించిపోతున్న వృక్షజాతులను కాపాడుతూ మానవ మనుగడకు తోడ్పాటునందించాలని పలువురు కోరుతున్నారు. మహాబిలం, అర్జున పత్రం, సంద్ర, గోనె బూరుగ తదితర వృక్ష సంపదను కాపాడేందుకు కృషిచేయాలని కోరుతున్నారు. సహజ సిద్ధమైన మొక్కలు నాటేందుకు ప్రభుత్వాలు, శాస్త్రవేత్తలు కృషిచేస్తూ వాటి పెంపకానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ ప్రజలకు అవగాహన కల్పించాలని కోరుతున్నారు.


నర్సరీ మొక్కలను పరిశీలిస్తున్న అధికారులు

**నింగికి చుక్కలు.. నేలకు మొక్కలు అందం**

పర్యావరణ కాలుష్యంతో అనారోగ్యాలకు గురవుతున్న కారణంగా ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటుతూ వాటిని సంరక్షిస్తూ పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటునందించాలి. కుటుంబంలో చిన్నతనంలో అందరూ కలిసి మెలిసి ఉంటారు. పెద్దయ్యాక విడిపోతారు. మొక్కకు నాటేప్పుడు మొక్కల మధ్య దూరం ఉంచి నాటితే అవి వృక్షాలుగా మారి దగ్గరవుతున్నాయి. జీవ వైవిధ్యం మనుగడ పర్యావరణంపై ఆధారపడిఉంది. మొక్కలు ఎంత వరకు ఆరోగ్యాన్ని సంరక్షిస్తాయో తెలియజేస్తూ అవగాహన కల్పించాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

**మొక్క నాటి సంరక్షించండి**



ప్రత్యేక రోజులను పురస్కరించుకుని ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలి. పుట్టిన, పెళ్లి రోజున శుభకార్యాలకు సంబంధించి మొక్కలను నాటుతూ వాటిని సంరక్షించడంతో జీవితంలో నాటిన మొక్కకు ప్రత్యేకత ఏర్పడుతుంది. పూర్వీకుల వృక్ష సంపదను కాపాడుతూ ఆరోగ్యంగా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. – పర్మయ్య,నర్సరీ, అవెన్యూ ప్లాంటేషన్స్ మెయింటెనెన్స్, కొడంగల్

**ఆరోగ్యాన్నిచ్చే మొక్కలను పెంచాలి**



ఎడ్యుకేషన్, టెక్నాలజీ ఎంతగానో పెరుగుతుంది. ఇందుకు అనుగుణంగా ఆరోగ్యాన్ని అందించే మొక్కల పెంపకంపై తోడ్పాటునందించాలి. ఆరోగ్య సంరక్షణకు పెరటి మొక్కల పెంపకంలో భాగంగా అంతరించిపోతున్న ఆరోగ్యాన్ని అందించే మొక్కల పెంపకంపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక చొరవ చూపాలి.

– హీరాలాల్, ఆయుర్వేద వైద్యులు, కొడంగల్

### ముగ్గురు నిందితులకు రిమాండ్

మర్పల్లి: ఓ చోరీ కేసులో ముగ్గురు నిందితులను మర్పల్లి పోలీసులు శనివారం రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ అరుణ్‌కుమార్‌గౌడ్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని గ్రామాల్లో కొంతకాలంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్ కాయిల్స్(వైరు), ఆయిల్ దొంగిలిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి పోలీస్ సిబ్బంది పట్లూర్, కోహీర్ చౌరస్తా వద్ద గస్తీ కాస్తుండగా ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా ఓ వాహనంపై వెళ్తున్నారు. దీంతో వారిని తనిఖీ చేయగా కాపర్ కాయిల్స్, ఆయిల్ లభ్యమయ్యాయి. సంగారెడ్డి జిల్లా సదాశివపేట్ మండలం మద్దికుంటకు చెందిన మెగావత్ రవి, మెగావత్ పండరి, శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. శనివారం సాయంత్రం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

### అనర్హులు వివాహం చేయడం సరికాదు

ఖాజీ షేక్ ఆదిల్


సీఐ శంకర్‌కు వినతిపత్రం అందిస్తున్న మైనార్టీ నాయకులు

కొడంగల్ రూరల్: మండల పరిధిలోని ఖాజీ(ముస్లిం పెళ్లిళ్లు చేసే గురువు)గా ప్రభుత్వం తననున నియమించిందని షేక్ ఆదిల్ సీఐ శంకర్‌కు తెలిపారు. కానీ తాండూర్‌కు చెందిన మౌలానా, కొడంగల్ మండలానికి చెందిన మరో ఇద్దరు వివాహం చేస్తున్నారని వివరించారు. తనను కాదని ఎటువంటి అర్హత లేని వ్యక్తులు నిఖా చేయడం సరికాదని వారిపై చర్యలు తీసుకోవాలని ముస్లిం మైనార్టీ నేతలు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు.

## పథకాలకు ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లోకి..


ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు

ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

మోమిన్‌పేట: సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు స్వచ్ఛందంగా బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని పార్టీ జిల్లా అధ్యక్షుడు, వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. శనివారం కాంగ్రెస్ పార్టీకి చెందిన మోమిన్‌పేట గ్రామం ఎంపీటీసీ సభ్యురాలు–3 అరిగె రోజా బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు డి.వెంకట్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే ఆమెకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అర్హులందరికీ సంక్షేమ పథకాలు చేరవేస్తున్న ఏకైక ప్రభుత్వం బీఆర్‌ఎస్ అన్నారు. అనంతరం రోజా మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు దూరమవుతోందన్నారు. పార్టీ పటిష్టానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, మైపాల్, భిక్షపతి, మైపాల్‌రెడ్డి, రాజు, చంద్రకాంత్, సుధాకర్, రవి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే వైఎస్సార్ సంక్షేమ పాలన

- ప్రాజెక్టు రీడిజైన్ పేరిట ఉమ్మడి జిల్లాకు అన్యాయం
- మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్


మాట్లాడుతున్న ప్రసాద్‌కుమార్

బంట్వారం: తెలంగాణలో వైఎస్సార్ సంక్షేమ పాలన కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా శనివారం ఆయన మండల పరిధిలోని మాలసోమారంలో పాదయాత్ర చేపట్టారు. ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ మేనిఫెస్టోను వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆయన ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే వంట గ్యాస్ రూ.500కే ఇస్తామన్నారు. రైతు డిక్లరేషన్‌ను అమలు చేస్తామన్నారు. ఒకే ఇంట్లో అవ్వ తాతలిద్దరికి పింఛన్ మంజూరు చేస్తామన్నారు. చేవేళ్ల ప్రాణహితను దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి డిజైన్ చేస్తే బీఆర్‌ఎస్ ప్రభుత్వం రీడిజైన్ పేరిట ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు తీరని అన్యాయం చేస్తోందన్నారు. బడ్జెట్‌ను మాత్రం రూ.35వేల కోట్ల నుంచి రూ.లక్ష కోట్లకు పెంచి ఉమ్మడి మెదక్, కరీంనగర్ జిల్లాలకు నీటిని తీసుకుపోతున్నారని మండిపడ్డారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తామన్నారు. బంగారు తెలంగాణ పేరిట రాష్ట్రాన్ని మరో 20 ఏళ్ల వెనక్కి నెట్టారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో సీఎం కేసీఆర్‌కు ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌ను ఓడిస్తేనే పేదల బతుకులు బాగుపడుతాయన్నారు. అంతకు ముందు కాంగ్రెస్ పార్టీ మాలసోమారం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డిని, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా హరీశ్వర్‌రెడ్డిని నియమించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోచారం వెంకటేశం, సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి చామల రఘుపతిరెడ్డి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు రత్నారెడ్డి, వికారాబాద్ కోఆప్షన్ సభ్యులు ఎర్రవల్లి జాఫర్, నాయకులు నర్సింలు, రవీందర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, అంజిరెడ్డి, శ్రీకాంత్, తౌఫిక్, సంజీవ్, ఇసాక్, మున్నాబాయ్, సలీం, సాయిలు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## హత్య నిందితులకు రిమాండ్

పహాడీషరీఫ్: ప్రేమ వ్యవహారం గిట్టకనే యువతి కుటుంబ సభ్యులు గిరిజన యువకుడిని హత్య చేసినట్లు బాలాపూర్ పోలీసుల విచారణలో వెల్లడైంది. ఈ ఘటనతో ప్రమేయమున్న ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి శనివారం రిమాండ్‌కు తరలించారు. పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ ఆవరణలోని తన కార్యాలయంలో మహేశ్వరం డీసీపీ చింతమనేని శ్రీనివాస్, ఏసీపీలు అంజయ్య, ఉమా మహేశ్వర్ రావు, బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌లతో కలిసి కేసు వివరాలు వెల్లడించారు. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం కుప్పగండ్ల కేస్లీతండాకు చెందిన డెగావత్ పూల్‌సింగ్ 20 ఏళ్ల క్రితం నగరానికి వలస వచ్చాడు. మూడేళ్లుగా షాహీన్‌నగర్ సమీపంలోని వాదే ఉమర్ బస్తీలో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో పూల్‌సింగ్ కుమార్తె స్నేహితురాలితో పూల్‌సింగ్ కుమారుడు పవన్ నాయక్(22) పరిచయం పెంచుకుని ఫోన్ మాట్లాడటం ప్రారంభించాడు. విషయం తెలుసుకున్న యువతి కుటుంబ సభ్యులు తమ మకాంను పహాడీషరీఫ్‌కు మార్చినప్పటికీ.. వీరి నడుమ ఫోన్ వ్యవహారం కొనసాగుతూ వచ్చింది. చివరకు యువతి బాబాయి మహ్మద్ గౌస్ (30) విషయం తెలుసుకొని పవన్‌ను హెచ్చరించాడు. అనంతరం తనకు పరిచయస్తుడైన ఎంజీఎం మీడియా అనే యూట్యూబ్ చానల్ చైర్మన్ మహ్మద్ మహమూద్(32) దృష్టికి తీసుకెళ్లాడు. ఇదే అదునుగా భావించిన మహమూద్ కేసును పోలీసుల దృష్టికి తీసుకెళ్తే కటకటాల పాలవుతావని.. అలా కాకుండా రూ.5 లక్షలు చెల్లించి సెటిల్ చేసుకోవాలని సూచించాడు. ఈ విషయాన్ని పవన్ కుటుంబ సభ్యులకు కూడా చెప్పడంతో వారు వచ్చి.. తాము పేదోళ్లమని రూ.50 వేల వరకు ఇస్తామని అభ్యర్థించారు. చివరకు రూ.3 లక్షలైనా ఇవ్వాలనడంతో రాజీ కుదరలేదు. డబ్బులు రాకుండాపోయాయన్న అక్కసుతో ఈ నెల 8న మహమూద్ యువతి కుటుంబ సభ్యులను రెచ్చగొట్టాడు. ఈ క్రమంలోనే అదే రోజు రాత్రి పవన్ ఇంటి వద్ద గౌస్, తన స్నేహితుడు మహ్మద్ సద్దాం (23)తో కలిసి కాపు కాశాడు. రాత్రి 11.45 గంటల సమయంలో మూత్ర విసర్జనకు బయటికొచ్చిన పవన్‌ను బరాత్‌లో నృత్యం కోసం నాందేడు నుంచి తెచ్చుకున్న రెండు కత్తులతో నరికి చంపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులపై హత్య, ఎస్సీ, ఎస్టీ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి కత్తులు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

## చైన్‌స్నాచర్లపై పీడీ యాక్ట్

- జల్సాలు, క్రికెట్ బెట్టింగ్‌ల కోసం వరుస చోరీలు
- ముగ్గురు నిందితుల రిమాండ్
- చర్లపల్లి జైలుకు తరలింపు


నేరస్తులు ప్రసన్నకుమార్, సాయికుమార్, అనిల్‌కుమార్

ఇబ్రహీంపట్నం రూరల్: జల్సాలు, క్రికెట్ బెట్టింగ్‌ల కోసం చేసిన అప్పులు తీర్చేందుకు చైన్‌స్నాచర్లుగా అవతారమెత్తిన ముగ్గురిపై రాచకొండ పోలీసులు పీడీయాక్ట్ నమోదు చేశారు. ఇందుకు సంబంధించి ఆదిబట్ల సీఐ రవికుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పత్తి ప్రసన్నకుమార్(23), పత్తి సాయికుమార్ (20) సొంత అన్నదమ్ములు. తూర్పు గోదావరి జిల్లా కూనవరం మండలం పైడిగూడెం వీరి స్వగ్రామం. ప్రస్తుతం మేడ్చల్‌లో నివాసం ఉంటున్నారు. తుక్కుగూడ మున్సిపాలిటీలోని రావిర్యాల్‌కు చెందిన బుట్టి అనిల్‌కుమార్ (28) వీరికి వరుసకు బావ అవుతాడు. ప్రసన్నకుమార్, సాయికుమార్ క్రికెట్ బెట్టింగ్‌లకు అలవాటు పడి, అప్పుల్లో కూరుకుపోయారు. వీటిని తీర్చేందుకు చైన్ స్నాచింగ్‌లకు పాల్పడాలని పథకం వేశారు. తమ ఆలోచనలను బావ అనిల్‌తో పంచుకున్నారు. ముగ్గురూ కలిసి దొంగతనాలకు సిద్ధమయ్యారు. సీసీ కెమెరాలు లేని ప్రాంతాలను ఎంచుకుని చైన్ స్నాచింగ్‌లు చేయాలని నిర్ణయించుకున్నారు. ఒంటరిగా వెళ్లే మహిళలను టార్గెట్ చేసుకుని, వీరి మెడలోని బంగారు ఆభరణాలను లాక్కుని ఉడాయిస్తున్నారు. గత జనవరిలో ఆరుసార్లు చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడ్డారు. చోరీ సొత్తును ఎల్బీనగర్‌లో విక్రయించారు. వచ్చిన డబ్బుతో అప్పులు తీర్చడంతో పాటు విలాసాలకు అలవాటుపడ్డారు. వీరిపై పక్కా సమాచారం అందడంతో 25 జనవరి 2023న ముగ్గురినీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరినుంచి రూ.78 వేల నగదు, బైకు, మూడు తులాల బంగారు అభరణాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పీడీ యాక్ట్ నమోదు చేసి, చర్లపల్లి జైలుకు తరలించారు.

## ఇక తాయిలాల

# పర్వం

**ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం**

- ప్రైవేటు ఉపాధ్యాయులు, అధ్యాపకులకు ఎర
- తమ అభ్యర్థికి ఓటు వేయాలని ఒత్తిడి
- ఒక్కో ఓటుకు రూ.5 వేల వరకు చెల్లింపులు
- రేపు జరగనున్న ఎన్నికలకు అంతా సిద్ధం
- బరిలో నిలిచిన 21 మంది అభ్యర్థులు
- గ్రేటర్ జిల్లాలో 67 పోలింగ్ కేంద్రాలు




సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఉమ్మడి రంగారెడ్డి జిల్లా హైదరాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల ఉపాధ్యాయ శాసన మండలి ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రంతో ముగిసింది. మొత్తం 21 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. సోమవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు అధికారులు రంగారెడ్డి జిల్లాలో 31, హైదరాబాద్‌లో 22, మేడ్చల్‌లో 14 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రిసైడింగ్ ఆఫీసర్లు, సహాయ ప్రిసైండింగ్ ఆఫీసర్లు, ఎన్నికల సిబ్బంది సహా బ్యాలెట్ పేపర్లు ఇతర మౌలిక సదుపాయాలు సమకూర్చారు. ఎన్నికలకు సర్వం సిద్ధం చేశారు.

**మందు.. విందు..**

ఇప్పటివరకు సభలు, సమావేశాలు, ప్రచారంతో బిజీగా కన్పించిన అభ్యర్థులు.. శనివారం రాత్రి నుంచే తాయిలాలకు తెర లేపారు. మద్యం, మాంసంతో పాటు ఓటుకు నోటు వంటి పంపకాలు కూడా ప్రారంభించారు. ముఖ్యంగా నగర శివారులోని ఇంజినీరింగ్, మెడికల్ కాలేజీలు, ప్రైవేటు అధ్యాపకులు, ఉపాధ్యాయులే టార్గెట్‌గా పంపకాలు చేస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వ ఉపాధ్యాయులకు సాయంత్రం మందు, విందులు ఏర్పాటు చేసి, ప్రైవేటు వారికి ఒక్కో ఓటుకు మద్యం సహా రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు గుట్టుగా చెల్లిస్తున్నట్లు తెలిసింది. ఎలాగైనా ఓటర్లను మచ్చిక చేసుకుని, ఎన్నికల్లో గెలుపొందాలని భావించి అడ్డదారులు తొక్కుతున్నారు.

**కీలకంగా 'ప్రైవేటు' ఓటర్లు**

ఎమ్మెల్సీ నియోజకవర్గం పరిధిలో మొత్తం 29,655 ఓట్లలో 1,265 ఓట్లు మైనారిటీ గురుకులాల్లో, 802 ఓట్లు తెలంగాణ మోడల్ స్కూళ్లలో ఉన్నాయి. 948 ఓట్లు కేజీబీవీల్లో ఉండగా, 480 కోట్లు జ్యోతిరావుపూలే గురుకులాల్లో ఉన్నాయి. 6,204 ఓట్లు ప్రభుత్వ పాఠశాలల్లో ఉండగా, 24 ఓట్లు ఎయిడెడ్ పాఠశాలల్లో, 1,112 ఓట్లు సోషల్ వెల్ఫేర్ స్కూళ్లలో ఉన్నాయి. 89 ఓట్లు టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్‌లో, 236 ఓట్లు టీఎస్‌డబ్ల్యూయూఆర్‌లో ఉన్నాయి. టీడబ్ల్యూఆర్‌ఎస్‌లో 36, యూఆర్‌ఎస్‌లో 13 మంది ఓటర్లు, జెడ్పీహెచ్‌ఎస్ స్కూళ్లలో 13,820 మంది ఓటర్లు ఉన్నారు. కేంద్రీయ, ఇతర స్కూళ్లలో మరో 61 మంది ఓటర్లు ఉన్నారు. మరో 4,564 మంది ఓటర్లు ప్రైవేటు స్కూళ్లు, కాలేజీలు, ఇంజినీరింగ్, ఇతర ఇనిస్టిట్యూట్‌లలో పని చేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఉన్నారు. అభ్యర్థుల గెలుపు ఓటముల్లో కీలక పాత్ర పోషించనుండటంతో బరిలో నిలిచిన వారంతా ఈ ఓటర్లపై ప్రధానంగా దృష్టి సారించారు. వీరిని ప్రసన్నం చేసుకునేందుకు కొంత మంది డబ్బులు ఆశ చూపుతున్నారు.

**తెర వెనుక ప్రధాన పార్టీల లీడర్లు..**

- పార్టీలకతీతంగా జరిగే ఈ ఎన్నికల్లోనూ అధికార, ప్రతిపక్ష పార్టీలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. పోల్ మేనేజ్‌మెంట్‌పై అనుభవం ఉన్న ఆయా పార్టీల నేతలు స్వయంగా రంగంలోకి దిగారు. ప్రత్యక్షంగా ప్రచారంలో పాల్గొనకపోయినా.. పరోక్షంగా వారికి సహకరిస్తు న్నారు. ఆర్థిక వనరులను సమకూర్చడం మొదలు.. పోల్ మేనేజ్‌మెంట్ వరకు అన్నీ వారే చూసుకుంటున్నారు. ప్రైవేటు యాజమాన్యాలకు స్వయంగా ఫోన్ చేసి తాము సూచించే అభ్యర్థులకు ఓటు వేయించాల్సిందిగా ఆయా కళాశాలల యజమానులపై ఒత్తిడి తెప్పిస్తున్నారు.
- అధికార పార్టీకి చెందిన ఓ మంత్రి సహా మరో ఎమ్మెల్సీ ఇందులో కీలక పాత్ర పోషిస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. వామపక్ష పార్టీ పెద్దలు స్వయంగా రంగంలోకి దిగి పోటీలో లేని ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాలకు స్వయంగా ఫోన్ చేసి తమ అనుబంధ సంఘాల అభ్యర్థులను గెలిపించాల్సిందిగా కోరుతున్నారు. ప్రచార గడువు ముగియడంతో అభ్యర్థులు ప్రస్తుతం వాట్సాప్ గ్రూపులు వేదిగా విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై ఇప్పటి వరకు చేసిన పోరాటాలు.. బ్యాలెట్ పేపర్‌లో తమ సీరియల్ నంబర్, తమనే ఎందుకు గెలిపించాలి? గెలుపొందిన తర్వాత ఉపాధ్యాయుల కోసం ఏం చేయబోతున్నాం? వంటి అంశాలను స్వయంగా రికార్డ్ చేసి ఓటర్లకు షేర్ చేస్తుండటం కొసమెరుపు.

### ఏర్పాట్లు పూర్తి: జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేష్

ఉపాధ్యాయ శాసన మండలి ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు 739 పోలింగ్ అధికారులు, సిబ్బందిని నియమించినట్లు పేర్కొన్నారు. మొత్తం 137 పోలింగ్ కేంద్రాలు కాగా ఒక్కొక్క పోలింగ్ కేంద్రానికి 137 పి.ఓ లు, 137 ఏ.పి.ఓ లు, 319 ఇతర పోలింగ్ సిబ్బందిని నియమించారు. మొత్తం 593 మంది సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన మెటీరియల్‌ను తీసుకొని పోవడానికి జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఎన్ని కల నిర్వహణకు నియమితులైన పోలింగ్ అధికారులు, సిబ్బంది ఆదివారం ఉదయం 8 గంటలకు జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కు రావాలన్నారు. రిసెప్షన్ సెంటర్ సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసినట్లు స్పష్టం చేశారు.